క్లుప్తంగా

పబ్లిక్ టాయిలెట్స్‌పై అవగాహన



పబ్లిక్ టాయిలెట్స్ వద్ద మహిళలు

కోరుట్లటౌన్: పబ్లిక్ టాయిలెట్స్‌పై మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా దుర్గా భవాని మహిళా పొదుపు సంఘం చెందిన సభ్యులు పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్స్ పరిసరాలను పరిశుభ్రం చేసి, ముగ్గులతో పరిసర ప్రాంతాలు అలంకరించారు. పబ్లిక్ టాయిలెట్ వద్ద సేవలు అందిస్తున్న మహిళను శాలువతో సన్మానించారు. పట్టణంను బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా మార్చడానికి సహకరించాలని కోరారు.

గడ్డికట్టలు వితరణ



గడ్డి కట్టలు అందజేసిన నాయకులు

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గోవులకు కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన గడీల లక్ష్మణ్ 120 గడ్డి కట్టలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాడవేణి నరేశ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు బింగి వెంకటేశ్, చెన్నవేణి అజయ్, శకుంతల మధు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

50 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



ఐలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం

కోరుట్ల రూరల్: మండలంలోని 9 గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 50 వేల 508 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఐకేపీ ఏపీఎం శంకర్ శనివారం తెలిపారు. చిన్న మెట్‌పల్లిలో 3,958 క్వింటాళ్లు, ధర్మారంలో 6,010 క్వింటాళ్లు, జోగిన్‌పల్లిలో 4623 క్వింటాళ్లు, మాదాపూర్‌లో 9,519 క్వింటాళ్లు, మోహన్‌రావుపేటలో 8,245 క్వింటాళ్లు, నాగులపేటలో 4,582 క్వింటాళ్లు, పైడిమడుగులో 4,043 క్వింటాళ్లు, సంగెంలో 4,049 క్వింటాళ్లు, వెంకటాపూర్‌లో 5,027 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఐకేపీ ఏపీఎం పేర్కొన్నారు.

నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, చింతకుంట రూట్‌లలో నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ మండల నాయకులు పల్లె గంగాధర్, ఉత్కం విష్ణు అధికారులను కోరారు. నైట్‌హాల్ట్ బస్సుతో దూర ప్రాంతాలకు వెళ్లినవారు స్వగ్రామాలకు చేరుకోవడానికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వేకువ జామున బస్సు సౌకర్యం ఉండటం వల్ల కూరగాయాలు, పాలు పట్టణప్రాంతాలకు తీసుకెళ్లే వీలుంటుందన్నారు. గతంలో ఈ రూట్‌లో నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం ఉండేదన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

టాలెంట్ హంట్ పరీక్షను బహిష్కరించాలి

గొల్లపల్లి: ఈనెల 17న వీఎంసీ కళాశాల యజమాన్యం నిర్వహిస్తున్న టాలెంట్ హంట్ ఎగ్జామ్‌ను విద్యార్థులు, విద్యాక్షుల కమిటీ తల్లిదండ్రులు బహిష్కరించాలని ఎస్ఎస్‌యూఐ ధర్మపురి నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ శ్రీపాతుల మనోహర్ అన్నారు. గొల్లపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ వీఎంసీ పేరుతో విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఆశ చూపి ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష రాయాల్సిన విద్యార్థులకు తమ సంస్థ ద్వారా పరీక్ష నిర్వహించి ముందస్తుగా అడ్మిషన్లు చేసుకుంటుందని ఆరోపించారు. వెంటనే స్కాలర్‌షిప్ పరీక్షను బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం

రాయికల్: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ముంజ ధర్మపురి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి గోపా మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. మండల అధ్యక్షుడు బత్తిని నిరంజన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సురేశ్‌గౌడ్, కోశాధికారి గుగ్గిళ్ల రాముగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్‌గౌడ్, శ్రీధర్, రాజేందర్, సాగర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ: అసంపూర్తిగా రైతు వేదిక పనులు





ఖాళీగా ఉన్న దర్వాజ పై భాగం



దోర్ కూడా లేని కిటికీ

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ రైతు వేదిక పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ రైతు వేదికను రెండున్నరేళ్ల క్రితం ప్రారంభించారు. దర్వాజాల పైభాగంలో ఉన్న వెంటిలేటర్లకు అద్దాలు గానీ, వెల్డింగ్ జాలి కానీ బిగించకపోవటంతో ఖాళీగానే ఉన్నాయి. కిటికీలకు వెల్డింగ్ జాలి బిగించలేదు. దోర్ల అద్దాలు కూడా లేక పోవటంతో కిటికీల్లోనుంచి మనుషులు వెళ్లి రైతు వేదిక లోపల కూర్చుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ మిగిలి ఉన్న పనులు పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



కోరుట్ల: వెంకటాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాయికల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మేడిపల్లిలో..

కోరుట్ల రూరల్: కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ బర్త్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.వెంకటాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంట, సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు దేవ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను శనివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిట్టపెల్లి జీవన్ రెడ్డి, క్యాతం మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. 11వార్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రామ్‌లు నివాసంలో వేడుకలను జరిపారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో శనివారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: సోనియాగాంధీ జన్మదిన వేడుకలు గొల్లపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం ధర్మపురిలో నిర్వహించారు. నంది కూడలి వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మేడిపల్లి, భీమారం మండల కేంద్రాల్లో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, రమేశ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల మండల కేంద్రంలోని సోనియా గాంధీ గుడి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి,నేరెళ్ల సతీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరుతడి పంటలే మేలు..

- నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి
- రైతులకు అధికారుల అవగాహన



సిరిపూర్ శివారులో సాగవుతున్న వేరుశనగ పంట

మల్లాపూర్: యాసంగిలో ఆరుతడి పంటల సాగే మేలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఆరుతడి పంటలు శనగ, మొక్కజొన్న, జొన్న, పప్పుదినుసుల పంటల సాగు చేపట్టాలని అవగాహన కల్పిస్తున్నారు. యాసంగిలో ఆరుతడి పంటలపై నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సూచిస్తున్నారు. రైతులు పొలాల వద్ద ఇంకుడుగుంత నిర్మించుకుంటే అందులో వర్షం నీరు చేరి నిల్వ ఉంటుందని చెబుతున్నారు.



మొక్కజొన్న పంట

నీటి తడులు అందించాలి..

పంటలకు కీలకమైన పూతదశలో పంట నీటిఎద్దడికి గురైతే 50 శాతం కన్నా తక్కువ దిగుబడి వస్తుంది. నీటి తడులు లేక దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. పంటలకు గింజకాయ కట్టే దశలో నీటిని అందించాలి. జొన్న పంటలకు సాధారణంగా 400–660 మి.మీ నీరు అవసరం ఉంటుంది. మొక్కజొన్నకు 400–550 మి.మీ నీరు, వేరుశనగతో పాటు ఇతర పంటలకు 300–400 మి.మీ నీరు అవసరం. ఇందులో మొక్కలు నాటిన 15–18 రోజుల్లో నీటి తడులు అందించాలి. పంట తీసే సమయంలో కంటే 15 నుంచి 28 రోజుల్లోపు చివరి తడి అందించాలి. నీటి పారకం ద్వారా కాకుండా మొక్కల మొదట్లో నీరందిస్తే వేర్లకు త్వరగా చేరుతుంది. యాసంగిలో సాగుచేసే వరిపంటకు నాటు వేసినప్పుడు నుంచి పొట్టదశకు చేరే వరకు నీరు అవసరం ఉంటుంది. రైతులు మూసధోరణి కాకుండా ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేయాలి. దీంతో అధిక దిగుబడి పొందుతారని రైతులకు సూచిస్తున్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి నీటిని పొదుపుగా వాడితే దిగుబడి సాధించవచ్చని వారికి వివరిస్తున్నారు.


అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి



యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు పండిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. వీటితో పాటు కూరగాయల సాగుతో అధిక దిగుబడిని సాధించవచ్చు. రైతులు మూసధోరణితో కాకుండా ఆధునిక పద్ధతులు అవలంబించాలి. పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. ఆరుతడి పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించవచ్చు.

– సురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల

చి'వరి'కి సాగునీరందేనా?



సారంగాపూర్: యాసంగి సాగు ప్రారంభించేనాటికైనా పంట కాలువలను ఉపాధిహామీలో శుభ్రం చేయించాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి డీ–53. 12 ఎల్, డీ–53.11,12 ఆర్ ప్రధాన కాలువ కింద సారంగాపూర్ మండలంలోని 18 గ్రామ రైతులకు, బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలకు,ధర్మపురి మండలంలోని పలు గ్రామాలకు రోల్లవాగు ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ సాగునీరు అందుతోంది. ప్రస్తుతం ప్రధాన కాలువల్లో చెత్త, ముళ్లపొదల సమస్య పెద్దగా లేకపోయినా పొలాలకు నీరు చేరే ఫీడర్ చానళ్లు, ఫీల్డ్ చానళ్లు మొత్తం చెత్త, ముళ్లపొదలు, చెట్లుతో నిండిపోయాయి. ఇప్పటికే యాసంగి పొలాలకు రైతులు నార్లు పోస్తున్నారు. కాల్వల్లోని చెత్త, ముళ్లపొదలు, చెట్లు, పూడికను తొలగిస్తే చివరి భూములకు సాగునీరందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ సంబరాలు

మెట్‌పల్లి: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి, ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతో పట్టణంలో ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బస్‌స్టేషన్‌లో స్వీట్లు పంపిణీ చేసి బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగంతో పాటు పూదరి నర్సాగౌడ్, ఎర్రాల హన్మాండ్లు, యామ రాజయ్య, అందె మారుతి, రాజాగౌడ్ తదితరులున్నారు.

శాశ్వత వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలి



పెగడపల్లి పశువైద్య కేంద్రం

పెగడపల్లి: మండలం కేంద్రంలోని పశువైద్య కేంద్రానికి పర్మినెంట్ డాక్టర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు. ఆరు నెలల క్రితం ఇక్కడ పని చేసిన డాక్టర్ విక్రమ్ ఆరు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అయన స్థానంలో కొడిమ్యాల మండలం హిమ్మత్‌రావుపేటలో పని చేస్తున్న డాక్టర్‌కు ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రోగాల బారిన పడిన పశువులకు సమయానికి వైద్యం అందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అనారోగ్యం బారిన పడిన పశువులు, గొర్రెలను వైద్యం కోసం కేంద్రానికి తీసుకొస్తే డాక్టర్ అందుబాటులో లేని సమయంలో వెటర్నరీ అసిస్టెంట్ తెలిసి తెలియని వైద్య సేవలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పశువైద్యాధికారిని నియమించాలని మండల రైతులు కోరుతున్నారు.

ఉచిత ప్రయాణంపై సంబరాలు





ఇబ్రహీంపట్నం, రాయికల్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన నాయకులు



కోరుట్లలో ఉచిత బస్సు ప్రారంభిస్తున్న ప్రమీల

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా శనివారం మధ్యాహ్నం కోరుట్ల ఆర్టీసీ డిపోలో మహిళల కోసం ఉచిత బస్సును ట్రాఫిక్ ఇన్‌చార్జి టి. ప్రమీల ప్రారంభించారు. ఈ పథకంలో మహిళలకు, బాలికలకు, ఎక్స్‌జెండర్‌కు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, ఏడీఏ ఎస్ కే.రావు, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టు: ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకాన్ని శనివారం కొడిమ్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తమకు ఉచిత ప్రయాణం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జమల్పూరి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పిడుగు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రారంభించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసి మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, టీజేఎస్ ఇన్‌చార్జి కంతి మోహన్ రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మహిళ విభాగం నాయకురాలు లక్కిడి నర్సక్క, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మీ పథకం ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంపై మండలంలోని కొత్తపేటలో శనివారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు చంద్రసాయబు, ఉపాధ్యక్షుడు మల్లేశం, గంగారెడ్డి, బక్కన్న, గంగారెడ్డి, మందుల గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కుమార్ గెలుపుతో దుబాయిలో సంబరాలు



దుబాయిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

గొల్లపల్లి: ధర్మపురి ఎమ్మెల్యేగాఅడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజయం సాధించి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఎన్నారైలు, ఆయన అభిమానులు శనివారం దుబాయిలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసుకుని స్వీట్లు పంపిణీ చేశారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్ర పటాలను ప్రదర్శిస్తూ ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ విజయోత్సవ సంబరాలను అట్టహాసంగా నిర్వహించుకున్నారు. ధర్మపురి నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపాలని కోరారు. కార్యక్రమాల్లో గడ్డం మహేశ్, శశిధర్ రెడ్డి, బాలే లోహిత్ కుమార్ వర్మ, బొల్లె వంశీకష్ణ, బాలే రవీందర్, బొమ్మెన బాబు, రాజేష్ రాజిరెడ్డి. తిరుపతి, లవంగం, పుల్లె మల్లేశం పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని ఆలయాల్లో పూజలు



కొండగట్టులో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పూజలు

కొండగట్టు: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకోవాలని ఆరోగ్య పరిస్థితి బాగుండాలని శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొండగట్టు ఆలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అభిషేక పూజలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు వేద మంత్రాలు చదివి ఆశీర్వచనం అందజేసి శాలువాతో సత్కారించారు.ఆయన వెంట నాయకులు బద్దం తిరుపతిరెడ్డి,మిట్టపెల్లి సుదర్శన్, మేనేని రాజనర్సింగరావు,పునుగోటి కృష్ణారావు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో..

సారంగాపూర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంతో పాటు, పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కేసీఆర్‌కు యశోద ఆస్పత్రిలో కాలుకు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. అయితే కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ పలువురు పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ కోల జమున, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, పార్టీ ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్‌గౌడ్, తేలు రాజు, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



మెట్‌పల్లి: పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ఉత్సవ విగ్రహంతో స్వాములు శోభాయాత్రగా చెన్నకేశవనాథ ఆలయం వద్దకు వెళ్లారు. ముందుగా అక్కడి కోనేరులో చక్రస్నానం, అభిషేకాలు చేసి, ఆ తర్వాత చెన్నకేశవనాథ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి అయ్యప్ప ఆలయానికి తీసుకవచ్చి పూజలు, అభిషేకాలు చేశారు. శోభాయాత్రలో స్వాములు భజనలు, నృత్యాలతో హోరెత్తించారు.